
# శయనేషు రంభ



పందిరిమంచం మీద పదకొండోసారి, అటునించి ఇటు తిరుగుతూ అన్నాడు గోపాలం.

"ఏయ్ రంభా! ఒకసారి ఇటు తిరగవూ"

"నా పేరు రంభ కాదు, భామ" అన్నది భామ గోముగా, అటునించి ఇటు తిరగకుండా.

"నిన్ను పెళ్ళి చేసుకోకముందే నువ్వు భామవని మీ బామ్మ చెప్పింది. ప్రక్కనే, పక్కలో ఉన్నావుకదా అని అలా పిలిచాను. ఇటువేపు తిరగవూ" అడిగాడు ముద్దుగా గిరిజాల జుట్టు గోపాలం.

"అటుకేసి తిరగను" అన్నది భామ, తనలో తనే నవ్వుకుంటూ.

"అటుకేసి ఏమిటి? రెండవ పులకేసిలా, ఎవడు నీకు తెలుగు నేర్పింది" ఎగతాళిగా అన్నాడు గోపాలం.

"మా అగ్రహారం బళ్ళో అంగోస్త్రం మాస్టారు. ఎవరైతే మీకేం. మా గోదారి జిల్లాలో అలాగే అంటారు"

"మా గుంటూరు జిల్లాలో అట్టా అనరు"

"ఎట్టా? పెసరట్టా, మినపట్టా!" గలగలా నవ్వింది భామ.

"అటు తిరిగి నీ నవ్వుని వృధా చేస్తున్నావు.... ఇటుకేసి తిరగవా? నీ అందమైన నవ్వుని నాకు చూపించవా?" బ్రతిమిలాడాడు గోపాలం, భామ తలలోని మల్లెపూలు వాసన చూస్తూ.

"నువ్వు కూడా ఇటుకేసి అన్నావా! అమ్మ దొంగా....." మళ్ళీ నవ్వింది.

నవ్వటం ఆపేసిన తర్వాత, "నేను మీకేసి తిరిగితే, నా నవ్వులు కనిపిస్తాయి కానీ, నా తల్లోని మల్లెపువ్వులు దూరమవుతాయి కదా!" కవ్విస్తూ అన్నది భామ.

భామను తన వేపు తిప్పుకుని, తన రెండు చేతుల మధ్యా ఆమె ముఖారావిందాన్ని ఇమిడ్చి, "ఇదుగో నీ నవ్వులు నా దోసిట్లో దాచుకున్నాను" అని ఆమె నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాడు.

పడీ పడీ నవ్వింది భామ.

"ఎందుకు అలా పడీ పడీ నవ్వుతావ్....నా ముఖాన కోతులున్నాయా?" - ఎందుకు నవ్వుతున్నదో అర్థం కాక ఉక్రోషంగా అన్నాడు గోపాలం.

"కోతులు కాదు. నా బొట్టుబిళ్ళ..... మీ కోతి ముఖం మీద కాదు... మూతి మీద...." పకపకా నవ్వింది. నవ్వుతూనే అతని పెదవి మీది బొట్టు తీసి, తన విశాలమైన నుదిటి మీద, చూపుడువేలుతో దిద్దుకున్నది.

భామ అలా నవ్వుతుంటే, ఆమె తెల్లటి నున్నటి రెండు బుగ్గల మీదా, సొట్టలు పడుతున్నాయి.

"నీ బుగ్గల మీద సొట్టలంటే నాకిష్టం" అన్నాడు గోపాలం, ఆమెను దగ్గరకు తీసుకుని, తల్లోని మల్లెపువ్వులు వాసన చూస్తూ.

"అంతా మోసం. మీరు చూపించేది ప్రేమ కాదు".

"మరేమిటి? దోమా?" నవ్వాడు గోపాలం.

"మీ దొంగ ఎత్తులు నాకు తెలుసు" అన్నది భామ, అతని మీదనించి చేయి తీస్తూ, నిగనిగలాడే చేతికి తొడిగిన ఎర్రటి గాజులు గలగలమంటుండగా.

"ఎత్తులు ఏమిటి.... పెళ్ళిలో వడ్డించిన లడ్డూల సాక్షిగా పెళ్ళాడిన భార్యాభర్తలం మనం" అన్నాడు గోపాలం.

"రాత్రి పూట మంచిది కాదుట. నల్లటి పిల్లలు పుడతారని, మా బామ్మ చెప్పింది".

"మరెప్పుడు మంచిదని చెప్పింది. మీ బామ్మ" ఉక్రోషంగా అన్నాడు గోపాలం.

"ప్రొద్దునే అయితే పొట్టివాళ్ళు పుడతారుట.. సాయంత్రమయితే రాక్షసులు పుడతారుట..."

"అయితే నువ్వు సాయంత్రం....." అంటున్న అతని మాటల మీద, తన వాలు జడవేసి, ఆనకట్ట వేసేసింది.

"ఛీ.... పాడు పిల్లాడా!.... నీకు సిగ్గులేదు" అన్నది తాంబూలంతో ఎర్రగా పండిన పెదాలను, సున్నాలా చుట్టి.

"నువ్వు మూతి సున్నాలా పెడితే, నాకు బోలెడంత ఇష్టం" అన్నాడు గోపాలం, ఇంకా దగ్గరికి జరుగుతూ.

"అదిగో... మళ్ళీ దొంగ ఎత్తులు... ఇప్పుడప్పుడే పిల్లలొద్దంటారు.... మళ్ళీ".

గోపాలం చిరుకోపం చూపించాడు. "పిల్లలొద్దంటే.... అ..న్నీ... వద్దని కాదు" అన్నాడు.

"మరి?" తన పెద్ద కళ్ళను, రెపరెపలాడించింది భామ.

"నీకు గంపెడు పిల్లలు కావాలంటావు కదా.... మరి దగ్గరకు రానీయవేం?"

"గంపెడు కాదు. ఇద్దరు చాలు. కానీ ఇప్పుడు కాదు".

గోపాలం ఎగతాళిగా అన్నాడు, పేరిందలా తన గడ్డం మీద చేయి వేసుకుని, "ఇదేం సోద్యంరా బాబూ! మొగుడికేమొ పిల్లలక్కర్లేదు, అయినా ముందుకి దూకుతున్నాడు. పెళ్ళానికేమో పిల్లలు కావాలి, అయినా దగ్గరికి రానీయదు".

అతని మాటలకు విరగబడి నవ్వింది భామ. ఆమె నవ్వుకి, సంపెంగ మొగ్గలాటి ఆమె ముక్కుమీది, తెల్ల రాతి ముక్కు పుడక తళతళా మెరిసింది, తనూ ఉన్నానని.

నవ్వటం అయ్యాక, విరగబడటం కూడా ఆపేసి, అటుకేసి తిరిగి పడుకుంది భామ.

భామ జడ, గోపాలం ముక్కుకి తగులుతున్నది. ముక్కు దురదపెట్టి, హాచ్చిమని తుమ్మాడు.

"చిరంజీవ... చిరంజీవ... శ్రీరామరక్ష" అన్నది భామ. అన్న తర్వాత, కొంచెం నొచ్చుకుంటూ "అయ్యో! నా మతిమండా. వయసులో నాకన్నా పెద్దవాళ్ళని అలా అనచ్చో అనకూడదో కూడా తెలీదు నాకు.." అన్నది.

ముక్కూ, ఒళ్ళూ మండుతుండగా అన్నాడు గోపాలం - "పోనీ ఒక పని చేయి, మీ బామ్మనడిగిరా, చెబుతుంది. అనచ్చో అనకూడదో, ఏ సమయంలో అంటే మంచిదో..." చివరి

మాట కొంచెం ఒత్తి పలికాడు కూడాను.

"తప్పు అలా అనకూడదు. చచ్చి ఏ లోకాన ఉందో", ఆమె గొంతు కొంచెం బొంగురు పోయింది.

ఆమె మనసు నొచ్చుకుందని, గోపాలం మన్నింపుగా అన్నాడు. "సారీ భామా! నువ్వు దగ్గరికి రానివ్వలేదని, కొంచెం కోపం వచ్చి అట్లా అన్నానంతే. మీ బామ్మంటే, నాకూ బోలెడిష్టం. నీకూ తెలుసు కదా ఆ విషయం".

"సరే పడుకోండి. అర్ధరాత్రి అవుతోంది. మళ్ళీ ప్రొద్దున్నే మీరు కొలువుకి పోవాలి కూడాను" అని, తన నున్నటి కాళ్ళ మీద మెత్తగా జారిపోతున్న సిల్కు దుప్పటిని పైకి లాక్కుంది. కాళ్ళ మీది వెండి పట్టీల మువ్వలు, గణగణమని బెల్ కొట్టాయి, నిద్రపోయే సమయం అయిందని.

గోపాలం ఒక్కక్షణం మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నాడు, ఆమె నల్లటి జడను చూస్తూ.

ఉన్నట్టుండి, "నువ్వు శృంగారంలో వర్థి జడ పదార్థానివి భామా!" అన్నాడు ఆమె జడ లాగుతూ.

భామకి చిరుకోపం లాంటిది వచ్చినా, ఆ మాటలకి అతనే తాత్పర్యం చెబుతాడులే అని, మౌనంగా ఊరుకుంది.

భామ చెప్పకపోయినా, ఆమె మనసు చెప్పింది కాబట్టి, టీకా తాత్పర్యం చెప్పటానికి ఉపక్రమించాడు గోపాలం.

"నీ రెండు జడలు చూసి, నువ్వే నా రెండు జడల సీతవని, కల్యాణం చేసుకున్నాను. పెళ్ళవగానే మనమిద్దరం ఒకటయాం. మనలాగానే నీ రెండు జడలు కూడా ఒకటయాయి" అన్నాడు గోపాలం, సర్కారు వారికి పిటీషన్ పెడుతూ.

భామ ఏదో చెప్పబోతుంటే, వారించాడు గోపాలం - "నాకు తెలుసు. మీ బామ్మ చెప్పంటుంది. పెళ్ళయ్యాక రెండు జడలు వేసుకుంటే, నీ జుట్టులాంటి నల్లరి కవల పిల్లలు పుడతారని, అందుకే మానేశావు. అలా కోపంగా చూడకు. మీ బామ్మ మీద నాకు బండెడు గౌరవం ఉందని ఇందాక ఒకసారి చెప్పినట్టు గుర్తు".

"అవును ఇందాక ఒకసారి చెప్పినట్టే గుర్తు. కానీ బండెడు కాదు. బోలెడు అన్నావు" దెప్పుతూ అన్నది భామ.

"ఏమిటి నన్ను నువ్వు అన్నావా... చెంపలేసుకో. కళ్ళుపోతాయి".

"అమ్మో కళ్ళుపోతే ఎలా... మిమ్మల్ని చూడకుండా ఉండగలనా... సారీ గోపాలం." అన్నది

భామ, ముక్కుని అందంగా చిట్లించి, తన చక్కటి తెల్లని పలువరసను చూపిస్తూ.

"అమ్మ పతివ్రతా! పేరు పెట్టి కూడా పిలుస్తున్నావా? దెప్పటంలో కూడా అందంగా దెప్పటమే, ఈ సత్యభామ అందం. ఏం చెబుతున్నానూ. అదీ నువ్వు శృంగారంలో ఒట్టి జడ పదార్థానివి. సంసారం అంటే సెక్స్ ఒక్కటే కాదు. సెక్స్ కూడాను. మన పెళ్ళితో, నీకు నన్నూ నాకు నిన్నూ మూడు ముళ్ళు వేసి గాఠ్ఠిగా బంధించేశారు. కనుక మనం ఇక జీవితాంతం కలిసే ఉంటాం. ఆడుకుంటాం. పాడుకుంటాం. తిండి తింటాం. పిల్లల్ని కంటాం. టాం టాం టాం. మన తంటాలు మనం పడతాం. వాటన్నిటినీ, ఎప్పుడు ఏం చేయాలో, ఎందుకు చేయాలో, ఎట్లా చేయాలో, మన మిద్దరమే - అంటే నువ్వూ, నేను కలిసి - నిర్ణయించుకుంటాం. ఏమన్నా అభ్యంతరాలుంటే, నేను చెప్పింది నువ్వు ఒప్పుకునేదాకా పోట్లాడుకుంటాం. చెడూ, మంచీ, రాత్రీ, పగలూ, కష్టం, సుఖం, రోగం, రెస్టూ, కంచం, మంచం, ఇద్దరం కలిసి సమానంగా పంచుకుంటాం" ఆగాడు గోపాలం. వెంటనే అన్నాడు, "ఏయ్! కొంచెం అటు జరుగు. మంచం అంతా నీ ఒక్కదానికే స్వంతం అనుకుంటున్నావా..." అని.

కొంచెం పక్కకి, జరిగి, అటుకేసి తిరిగి పడుకుంది భామ.

"ఏం పిల్లా! మళ్ళీ అటువేపు తిరిగావేం. ముక్కు మీద ఉంటుంది కోపం. నీకు ఇష్టం లేకపోతే నోటితో చెప్పు. అంతే కానీ హర్తాళ్ళూ, బందులూ చెయ్యకు. నాకు బాగుండదు".

నోట్లో చిటికెన వేలు పెట్టుకుని, గోరింటాకు పండిన గోరును కొరుకుతున్నది భామ.

"ఇదుగో.... గోరు కొరకటం సమాధానం కాదు. అసలు నీకిది తెలుసా.... గోళ్ళు కొరకటం శృంగార లక్షణం".

ఠక్కున గోరు కొరకటం మానేసి, వేలికున్న నీలం రాతి ఉంగరాన్ని, వేలి మీద గుండ్రంగా తిప్పుతూ, తన చక్రాల్లాంటి కళ్ళను అలవోకగా మూసుకున్నది భామ.

"అమెరికాలో భార్యకి ఇష్టం లేనప్పుడు, భర్త శృంగారం చేస్తే బలాత్కారం క్రింద లెఖ్కట. ఆవిడగారు పోలీసులను పిలిస్తే. ఆయనగార్ని జెయిల్లో వేస్తారుట..." అన్నాడు గోపాలం.

"ఇది అమెరికా కాదు. ఆంధ్రదేశం. తెలుగుదేశం. భారతదేశం"

"అయితే.."

"అందుకే బ్రతికిపోయారు. లేకపోతే ఈ పాటికి, పోలీసులు మిమ్మల్ని చెట్టుకి తలక్రిందులుగా కట్టేసి వుండేవాళ్ళు. అందులోనూ ఆంధ్రా పోలీసోళ్ళు".

"అయితే... వాళ్ళు గోలీ సోడాగాళ్ళు అని చెప్పిందా మీ బామ్మ. అయినా, నా ప్రిన్స్‌పల్సు నాకూ ఉన్నాయి. నీకిష్టం లేనప్పుడు రేపు చేయటం నాకిష్టం లేదు".

"అదే నేనూ అనేది. ఇవాళా వద్దు, రేపూ వద్దూ అని" భామ సన్నగా నవ్వింది.

"ఛీ.... మొద్దు... తెలుగు రేపు కాదు... ఇంగ్లీష్ రేపు... ఇంకో విషయం తెలుసా నీకు?"

భామ ఏమిటీ అని అడగలేదు. అతను ఆమె అడక్కపోయినా, టీకా తాత్పర్యంతో సహా చెబుతాడని ఇందాకనే అనుకున్నదనుకున్నాం కదా, అందుకని.

"మా అమ్మకి నా మీద కోపం వచ్చి, ఒక్కొక్కప్పుడు ఇంట్లో కాఫీ ఇచ్చేది కాదు. అప్పుడు ఏం చేసే వాడ్నో తెలుసా. ఉడిపి శ్రీకృష్ణభవన్‌లో.... అంటే బయట... కాఫీ తాగేవాణ్ణి" అన్నాడు గోపాలం.

"ఛ. మీరలాటి వాళ్ళు కాదు..." విశాలమైన కళ్ళను విప్పి, చురుగ్గా చూసింది.

"నిజంగా బయట కాఫీ తాగేవాళ్ళం...." అమాయకంగా అందామనుకున్నాడు గోపాలం.

"నేను నమ్మను".

"నిజం చెబితే నమ్మరు" అన్నాడు గోపాలం.

"అది పాత సినిమా టైటిల్. నేను అడిగేది కాఫీ సంగతి కాదు... అన్నీ అబద్ధాలు".

"నేను చెప్పేది. కాఫీ సంగతే" నవ్వాడు గోపాలం.

"నాకు తెలుసు మీరెలాటి వాళ్ళో. కానీ మీకే తెలీదు. ఒక రహస్యం" కవ్వించింది భామ.

"ఏమిటి?" కనుబొమ్మలు చిట్లించాడు గోపాలం.

"మీరేమి అనుకోకూడదు. అనకూడదు...." అన్నది చిలిపిగా.

"ఏమిటి త్వరగా చెప్పు?" ఉడుక్కున్నాడు గోపాలం.

"చెప్పేస్తున్నా... మరీ....మరీ.... మా ఊళ్ళోనూ ఉంది... ఉడిపి హోటల్!" గల గలా నవ్వింది భామ, పారుతున్న గోదావరిలా.

"అమ్మదొంగా!" అన్నాడు గోపాలం ఉక్రోషంగా.

ఈలోగా రోడ్డు మీద, ప్రభుత్వం వాళ్ళు డబ్బులకు కక్కుర్తిపడి, చౌకగా కొన్న లంచాల ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్, ఛామ్మనేటంత సత్తువలేక, తుస్సుమని పేలింది. కరెంటుపోయి, అంతా చీకటయిపోయింది.

ఆమెను దగ్గరకు తీసుకుని, "భామా" అని ప్రేమగా పిలిచాడు గోపాలం.

"భామ కాదు... రంభ" అన్నదామె, అతని కౌగిలిలో ఒదిగిపోతూ. ●

(నా అభిమాన రచయిత ముళ్ళపూడి వెంకటరమణగారికి ధన్యవాదాలతో, క్షమాపణలతో - రచయిత).

*(ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక: అక్టోబరు 22, 1998)*